క్లుప్తంగా

మంత్రి వర్గ విస్తరణలో 'అడ్లూరి'కి అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న దుమాల గంగారాం

జగిత్యాలటౌన్: త్వరలో జరిగే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు అవకాశం కల్పించాలని మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం కోరారు. శుక్రవారం జగిత్యాలలో ఏర్పాటు చేసిన ఎంఎస్‌పీ సమావేశంలో మాట్లాడుతూ పాతికేళ్లుగా కాంగ్రెస్ పార్టీనే నమ్ముకున్న లక్ష్మణ్‌కుమార్ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఎన్నో ప్రలోభాలు, ఇక్కట్లను ఎదుర్కొని పార్టీ అభివృద్ధికి పాటుపడ్డారని గుర్తు చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నురుగు శ్రీను, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీశ్, ఉపాధ్యక్షుడు బోనగిరి కిషన్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి సందర్శన



ప్రభుత్వ ఆస్పత్రి వద్ద కాయకల్ప బృందం

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రి కాయకల్ప పీర్ అసెస్‌మెంట్ బృందం శుక్రవారం సందర్శించారు. స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ కేంద్ర ప్రభుత్వ కాయకల్ప ప్రోగ్రామ్‌లో భాగంగా హెల్త్ ఫెసిలిటీస్ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలు, సిబ్బంది పనితీరు, శానిటేషన్, పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటిండెంట్ సునీతా రాణి, ఆర్ఎంవో వినోద్, వానిలేషన్ ఇన్‌చార్జి రమేశ్, చైతన్య సుధా, సరళ, లలిత, కవిత, కరుణ, సురేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



నానో యూరియా అందిస్తున్న కేడీసీసీబీ డైరెక్టర్

సారంగాపూర్: రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే మరిన్ని కొత్త రుణాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందని ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, కేడీసీసీ బ్యాంక్ తుంగూర్ శాఖ మేనేజర్ హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన బీర్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వార్షిక సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇఫ్‌కో ఆధ్వర్యంలో రైతులకు నానో యూరియా పనితీరుతోపాటు, డ్రోన్‌ల ద్వారా నానో యూరియా స్ప్రేచేసుకునే విధానం వివరించారు. సమావేశంలో ఇఫ్‌కో సంస్థ ఏరియా మేనేజర్ శ్రీధర్, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ మందాటి సాగర్, విండో సీఈవో అయ్యోరి తిరుపతి, సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ప్రయాణికుల దినోత్సవం



ప్రయాణికులతో మాట్లాడుతున్న డీఎం

కోరుట్ల రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం ప్రయాణికుల దినోత్సవం నిర్వహించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాలతో ప్రతీ నెల నాలుగో శుక్రవారం ప్యాసింజర్స్ డే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మనోహర్ బస్టాండ్ పరిసరాలను పరిశీలించారు. ప్రయాణికులను కలిసి బస్టాండ్‌లో సమస్యలను తెలుసుకున్నారు. బస్టాండ్‌లో కుర్చీలు, ఫ్యాన్లు, తాగునీరు, టాయిలెట్లను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ గంగారాం, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'కి బీసీలు తరలిరండి

కథలాపూర్: ఏప్రిల్ 2న చలో ఢిల్లీ కార్యక్రమానికి బీసీలు తరలిరావాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కథలాపూర్‌లో మాట్లాడారు. విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్‌తో ఢిల్లీ వెళ్తున్నట్లు తెలిపారు. ఢిల్లీ వెళ్లే వారికి బీసీ సంక్షేమ సంఘం తరుపున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆసక్తిగల వారు తమను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలేవి?

- గ్రిడ్ నుంచి మిషన్ భగీరథ నీళ్లు రావడానికి తరచూ అంతరాయం
- స్థానికంగా సర్దుబాటు చేయాలంటున్న ప్రజలు.
- మండలంలో 44 రక్షిత మంచినీటి ట్యాంకుల ద్వారా నీటి సరఫరా

కథలాపూర్: మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ మంచినీరు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీని కోసం రెండు మూడు నియోజకవర్గాలకు కలిపి ప్రత్యేకంగా మిషన్ భగీరథ గ్రిడ్‌లు ఏర్పాటు చేసి పట్టణాలు, గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్నా.. నియోజకవర్గ పరిధిలో ఎక్కడ పైపులు పగిలిన, నీటిని సరఫరా చేసే విద్యుత్‌మోటార్లు మరమ్మతులకు గురైతే నాలుగైదు రోజులు మండలాలకు నీటిసరఫరా నిలిచిపోతోంది. ఇలాంటి సందర్భాల్లో గ్రామాల్లోని రక్షిత మంచినీటి ట్యాంకులకు నీళ్లందించేలా ప్రత్యామ్నాయంగా బోరుబావులు ఏర్పాటు చేస్తే నీటి సమస్యలు ఏర్పడవని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మండలంలో 44 రక్షిత మంచినీటి ట్యాంకులు

మండలంలోని అన్ని గ్రామాలకు సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న వేములవాడ శివారులోని గ్రిడ్ నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. మండలంలో 44 రక్షిత మంచినీటి ట్యాంకులు నిర్మించారు. మొత్తంగా 13 వేల నల్లా కనెక్షన్‌లు ఉన్నాయి. కాగా మిషన్ భగీరథ పథకంలో గ్రిడ్‌ల నుంచి గ్రామాల్లోని రక్షిత మంచినీటి ట్యాంకులకు ప్రత్యేకంగా పైపులైన్ ఏర్పాటు చేసేందుకు తవ్వకాలు చేపట్టగా పాత పైపులైన్లు ధ్వంసమయ్యాయి. ఒకొక్కసారి వేములవాడలో గ్రిడ్ వద్ద మోటార్లు పనిచేయకపోయినా, ఎక్కడైనా పైపులైన్ లీకేజీ అయినా.. మండలం మొత్తం నీటిసరఫరా నిలిచిపోయిన సంఘటనలున్నాయి. ప్రత్యామ్నాయంగా గ్రామాల్లోని ట్యాంకుల సమీపంలో బోరుబావులు ఏర్పాటు చేస్తే అప్పటికప్పుడు ట్యాంకులను నీటితో నింపి యథావిధిగా నల్లా నీరు సరఫరా చేయవచ్చని ప్రజలు అంటున్నారు.



భూషణరావుపేటలో మంచినీటి ← ట్యాంక్

ఏడు గ్రామాలకు గ్రిడ్ నుంచి వస్తేనే నల్లా నీరు సరఫరా

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలుండగా.. పలు గ్రామాల్లోని ట్యాంకులకు బోరుబావులతో అనుసంధానంగా పాత పైపులైన్ ఉంది. కానీ కథలాపూర్, సిరికొండ, భూషణరావుపేట, తాండ్ర్యాల, గంభీర్‌పూర్, కలిగోట, రాజారాం తండా గ్రామాల్లో మాత్రం వేములవాడ నుంచి నీరు సరఫరా అయితేనే నల్లా నీరు వచ్చే పరిస్థితులు ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ప్రత్యామ్నాయంగా బోరుబావులు ఏర్పాటు చేయాలని ఏళ్లుగా అధికారులకు, పాలకులకు విన్నవించుకున్న స్పందన కరువైందని ఆయా గ్రామాల ప్రజలు, ప్రతినిధులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రత్యామ్నాయంగా బోరుబావులు ఏర్పాటు చేసి నీటిసరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నల్లా నీళ్లు కొందరికే వస్తున్నాయి



ఇంటింటికీ నల్లానీరు అందిస్తున్నామని పాలకులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ తాండ్ర్యాలలో కొందరికే నల్లా నీళ్లు వస్తున్నాయి. వేములవాడ నుంచి నీళ్లు రాకపోతే స్థానికంగా ఉన్న బోరుబావులతో ట్యాంకులు నింపాలి. గ్రామం మొత్తం నల్లా నీరు రాని పరిస్థితులు నెలకొన్నాయి. వేసవికాలంలో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. అవసరమైతే కొత్తగా పైపులైన్ నిర్మించాలి.

–మామిడిపెల్లి ప్రవీణ్, తాండ్ర్యాల

ప్రతిపాదనలు పంపిస్తాం



తాగునీటి సమస్య ఉన్న గ్రామాల వివరాలు సేకరించాం. ప్రస్తుతం ట్యాంకులను ప్రత్యామ్నాయంగా నింపేందుకు చేయాల్సిన పనులకోసం ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రజలకు నీటి ఇబ్బందులు రాకుండా చూస్తాం. గ్రామాల్లో అవసరమైతే బోరుబావులు అద్దెకు తీసుకుని ట్యాంకులను నింపి నల్లానీరు సరఫరా చేసేలా ప్రణాళికతో ఉన్నాం.

– చంద్రశేఖర్, మిషన్ భగీరథ ఏఈ, కథలాపూర్

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

కథలాపూర్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యమని ట్రాన్స్‌కో ఎస్ఈ శాలియా నాయక్ అన్నారు. మండలంలోని చింతకుంట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రూ. 10 లక్షలతో ఏర్పాటు చేసిన బ్రేకర్‌ను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పొలం బాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విద్యుత్ భద్రత సూచనలు పాటించాలన్నారు. వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో మెట్‌పల్లి డీఈ గంగారాం, ఏడీఈ రఘుపతి, ఏఈలు నవీన్, భూమేశ్వర్, మాజీ ఎంపీటీసీ బొడ్డు బాలు, నాయకులు, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌లో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఎస్ఎస్ 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనంగా మరో 100 కేవీ ట్రాన్స్ ఫార్మన్‌ను చార్జ్ చేయగా ఎస్ఈ శాలియా నాయక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రమాదాలు, జాగ్రత్తలను ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో మెట్‌పల్లి డీఈ గంగారాం, కోరుట్ల ఏడీ ఆంజనేయరావు, ఏఈ భూక్య శ్రీనివాస్ నాయక్, మాజీ సర్పంచ్ పిడుగు రాధ, విద్యుత్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించిన ఎస్ఈ

యాదవుల హక్కులను సాధించుకుందాం

కథలాపూర్: యాదవులందరూ చైతన్యమై హక్కులను సాధించుకుందామని యాదవ సంఘం జిల్లా అడహక్ కమిటీ అధ్యక్షుడు గానవేని మల్లేశ్‌యాదవ్ అన్నారు. కథలాపూర్ మండలం పోతారంలో శుక్రవారం యాదవ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. పలువురితో సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభా పరంగా యాదవుల సంఖ్య అధికంగా ఉందని, ప్రభుత్వ పరంగా యాదవులకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. కులసంఘం బలోపేతం కోసం సభ్యులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు రామాజంనేయులు, రాచర్ల రవి, బర్ల మధు, మార్కం రాజేశం, కల్లూరి రమేశ్, రాజేందర్, నర్సయ్య పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల సందర్శన

మల్యాల: మండలంలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ సందర్శించారు. మల్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలతోపాటు, తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తును పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీస్ సిబ్బందికి సూచించారు.

బోరుబావి పనులు ప్రారంభం

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో ఎంపీ కోటా నిధులతో నిర్మిస్తున్న బోరుబావి పనులను మండల బీజేపీ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ బోరుబావి కోసం రూ. 2 లక్షలు మంజూరు చేసినట్లు నాయకులు తెలిపారు.కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్ రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రావు, మామిడిపెల్లి ప్రవీణ్, పాల్గొన్నారు.

విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎడ్యూమార్గం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ ప్యాకెట్ డిక్షనరీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజన్న, సంస్థ అధ్యక్షుడు మార్గం నాగమణి, సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

రాయికల్: పట్టణానికి చెందిన పురోహితులు జ్యోతిష్య జ్ఞానరత్న అవార్డు గ్రహీత పునుగోటి రమేశ్ శర్మను శుక్రవారం మెట్‌పల్లి గురుదత్త బ్రాహ్మణ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు గిరిధరశర్మ, ప్రధాన కార్యదర్శి మోహనకృష్ణ, కోశాధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సహకార సంఘ ధ్యేయం

రాయికల్: రైతుల సంక్షేమమే సహకార సంఘం ధ్యేయమని సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం రాయికల్ పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనంలో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యుల వాటాధనంపై 10 శాతం డివిడెంట్ ఖాతాల్లో జమచేశామని గుర్తుచేశారు. సహకార సంఘానికి నూతనంగా ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజర్ మంజూరైందని, ఉత్సాహవంతమైన రైతులు సభ్యత్వం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ మార్కండేయులు, వైస్ చైర్మన్ బేతి మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు, ఇన్‌చార్జి సీఈవో కట్కం జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న ఏనుగు మల్లారెడ్డి

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

మల్లాపూర్: మండల కేంద్రంలోని భరతమాత కూడలివద్ద శుక్రవారం ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసులు ప్రజలకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్‌నేరాలతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఎవరికి కూడా ఓటీపీలు చెప్పవద్దని, సెల్‌ఫోన్‌లో వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. ఎధైన సమస్య తలెత్తితో 1930తో పాటు తమకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై లచ్చయ్య, హెడ్‌కానిస్టేబుల్ నర్సింగరావు, కానిస్టేబుళ్లు వెంకటేశ్, నరేందర్ ఉన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

కథలాపూర్: మండలంలోని పోతారం గ్రామశివారులో అటవీభూమిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాన్ని తొలగించినట్లు అటవీశాఖ కథలాపూర్ సెక్షన్ అధికారి ముస్తాక్ ఆలీ శుక్రవారం తెలిపారు. అనుమతి లేకుండా అటవీభూముల్లో నిర్మాణాలు చేయడం సరికాదన్నారు.

పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసుల దాడి

కోరుట్ల: పట్టణంలోని ఓ ఇంట్లో శుక్రవార పేకాట ఆడుతున్న ఆరుగురిని సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సీసీఎస్ పోలీసులు దాడి చేసి రూ. 22,920 నగదు, ఆరు సెల్ ఫోన్లను సీజ్ చేశారు. ఆరుగురు వ్యక్తులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన

రాయికల్: మండలంలోని బోర్నపల్లిలో శుక్రవారం ఆయిల్‌పాం సాగుపై వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో ముక్తేశ్వర్ మాట్లాడుతూ ఆయిల్‌పాం పంట సాగుపై ప్రభుత్వం అందించే సబ్సిడీపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ నరేశ్, గ్రామస్తులు పాదం లత రాజు, కోల శ్రీనివాస్, భూమేశ్, తేజ పాల్గొన్నారు.

ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలి

రాయికల్: పట్టణంలోని బల్దియా ప్రజలు సకాలంలో ఇంటి పన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్ శుక్రవారం కోరారు. 2024–25 వరకు బకాయి ఉన్న ఇంటి యజమానులు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద ఆస్తి పన్ను, వడ్డీ బకాయిల్లో 90 శాతం రాయితీ స్కీం వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాడీ ఫ్రీజర్ వితరణ

వెల్గటూర్ : ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన రాపోలు శ్రీనివాసరావు తన తండ్రి రాపోలు సాయిదీప్‌రావు జ్ఞాపకార్థం గ్రామానికి బాడీ ఫ్రీజర్ బహూకరించారు. శుక్రవారం గుల్లకోట గ్రామపంచాయతీ కార్యాలయంలో మండల తహశీల్దార్ రవికాంత్, స్పెషల్ ఆఫీసర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో తల్లి శ్యామలాదేవి చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్, జగన్, శ్రీనివాస్, మల్లేశం, సత్యనారాయణ గౌడ్, సత్యంగౌడ్, రాజయ్య, నరేశ్, గంగయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

మల్లాపూర్: వచ్చే నెల 5న మల్లాపూర్‌లో నిర్వహించనున్న వీరహనుమాన్ విజయ యాత్ర కరపత్రాలను శుక్రవారం బజరంగ్‌దల్, వీహెచ్‌పీ నాయకుల ఆధ్వర్యంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లాల జలపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ నందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నాయకుడు ముద్దం సత్యనారాయణగౌడ్ ఆవిష్కరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సోదర భావానికి ప్రతీక రంజాన్



మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల: పవిత్ర రంజాన్ మాసం హిందూ, ముస్లింల సోదర భావానికి ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పాల్గొని మాట్లాడారు. ముస్లింల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు.కేసీఆర్ హయాంలో వర్ధిల్లిన గంగా, జమునా, తహెజీబ్ సాంప్రదాయాన్ని ప్రతీ ఒక్కరు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, బీఆర్ఎస్ నాయకుడు అనూప్ రావు, నాయకులు పాల్గొన్నారు.

గద్దె నిర్మించారు.. ట్రాన్స్‌ఫార్మర్ మరిచారు



పెగడపల్లి: లో వోల్టేజీ సమస్య నివారించేందుకు అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ గద్దె అలంకారప్రాయమైంది. మండలంలోని బతికపలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆరవెల్లి శివారులోని సుద్దపల్లి బ్రిడ్జి సమీపంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసి గద్దె నిర్మించారు. గద్దె నిర్మించి నెలలు గడుస్తున్న టాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో లో వోల్టేజీ సమస్య ఏర్పడుతూ పంట పొలాలకు సక్రమంగా నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ బిగించి సమస్య తీర్చాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: వరుణ్‌కుమార్
సబ్ డివిజనల్ అధికారి, సెల్‌ఫోన్ నంబర్: 9912970940

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ప్రేమ ఆప్యాయతలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల:విద్యార్థులు ప్రేమ ఆప్యాయతలు పెంపొందించుకోవాలని డీఎస్పీ రఘుచందర్ అన్నారు. శుక్రవారం అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాలలో క్రమశిక్షణతో ఉంటూ విద్య నేర్చుకోవాలని, ఉపాధ్యాయులు బోధించిన విధానాలను క్రమం తప్పకుండా పాటిస్తే విజయం చేకూరుతుందన్నారు. తల్లిదండ్రులు సైతం విద్యార్థులతో ఆప్యాయతగా ఉండాలన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి అల్ఫోర్స్ కృషి చేస్తుందని, విద్యార్థులకు అన్ని విధాలుగా సహకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణకు బీఆర్ఎస్ శ్రీరామ రక్ష



మాట్లాడుతున్న దావ వసంత

జగిత్యాల: బీఆర్ఎస్ తెలంగాణకు శ్రీరామ రక్ష అని, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలోని హామీలు అమలు చేసేంత వరకు ఉద్యమిస్తామని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. పార్టీ మారిన ఎమ్మెల్యే ఎక్కడా కన్పించడం లేదని, మాట్లాడటం లేదని ఆరోపించారు. జిల్లా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో బీఆర్ఎస్ పార్టీ పాత్ర కీలకమన్నారు. ప్రజల సమస్యలపై అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావు వైఫల్యాలపై ప్రశ్నలతో ముంచెత్తుతే మండలిలో కవిత వినూత్న ప్రదర్శనలు చేస్తూ ప్రభుత్వానికి ముచ్చెమటలు తెప్పిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీలు రమణ, కవిత బీర్‌పూర్ మండలం రోళ్లవాగుకు షెటర్లు బిగించాలని, కొండగట్టు అంజన్న ఆలయాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారన్నారు. ప్రభుత్వం వెంటనే హామీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, ఆనందరావు, మల్లేశం, దామోదర్‌రావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఉత్సవ కమిటీ ఏర్పాటు

పెగడపల్లి: ఏప్రిల్ 14న నిర్వహించే అంబేడ్కర్ జయంతి వేడుకల సందర్భంగా మండల అంబేద్కర్ సంఘం ఉత్సవ కమిటీని శుక్రవారం ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా బత్తుల ప్రదీప్, ప్రధాన కార్యదర్శిగా కొత్తూరి బాబు, ఉపాధ్యక్షులుగా దూల దుబ్బయ్య, గుమ్మడి స్వామి, సహాయ కార్యదర్శిగా శ్రీరామ్ అంజయ్య, కార్యదర్శిగా గుడివందుల లక్ష్మన్‌ను నియమించారు.

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ మండల కోఆర్డినేటర్‌గా కొమురయ్య

కథలాపూర్: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ మండల కో ఆర్డినేటర్‌గా భీమారం మండలం ఈదుల లింగంపేట గ్రామానికి చెందిన పుప్పాల కొమురయ్యను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కోఆర్డినేటర్ల నియామకం

మేడిపల్లి: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ మేడిపల్లి, భీమారం మండలాల కోఆర్డినేటర్లుగా వెలిచాల సత్యనారాయణ, ఉరుమడ్ల నర్సయ్యను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

బీజేపీ నాయకుల నిరసన

ధర్మపురి : ఆదాయ, కుల, నివాస ధృవీకరణ పత్రాలు జారీ చేయడంలో జాప్యం చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ పట్టణఅధ్యక్షుడు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ .. విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకుని కార్యాలయాల చుట్టు తిరిగే పరిస్థితులున్నాయని దీంతో విద్యార్థులకు ఉపకార వేతనాలు, సంక్షేమ పథకాలకు దూరమౌతున్నాయన్నారు. అధికారులు ప్రత్యేక చొరవ చూపి సర్టిఫికెట్లు ఆలస్యం చేయకుండా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లవన్‌కుమార్, మల్లేశ్, మాధవ్, దివిటి శ్రీధర్ తదితరులున్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

ధర్మపురి: నంది మేడారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది గడ్డం లింగారెడ్డి నూతనంగా ఎన్నికై ధర్మపురికి కోర్టుకు వచ్చిన సందర్భంగా ధర్మపురి న్యాయవాదులు ఆయనను సన్మానించి లక్ష్మీనృసింహుడి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులుపాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందిస్తాం



విద్యార్థులతో కలిసి నృత్యం చేస్తున్న టీచర్లు

వెల్గటూర్ : ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన నాణ్యమైన విద్యనందిస్తామని పైడిపెల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం తులసి ఆగమయ్య అన్నారు. పాఠశాలలో శుక్రవారం పాఠశాల వార్షికోత్సవంలో విద్యార్థులు,ఉపాధ్యాయులతో కలిసి పాల్గొన్నారు. నృత్యాలు చేసి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీష్, సునీత, సీఆర్పీ రజిని, తల్లిదండ్రులు పాల్గొన్నారు.